ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024
5
శ్రీ సత్యసాయి

ఈనాం కాదు... వేలం ద్వారా కొనాలి

మార్కెట్‌యార్డు ఛైర్మన్‌కు చీనీరైతుల వినతి

చీనీ పంటను ఈనాం పద్ధతిలో కాకుండా వేలం పాట ద్వారానే కొనుగోలు చేయాలని చీనీ పండ్ల తోటల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు మార్కెట్‌యార్డులో ఛైర్మన్ ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోనే అత్యధికంగా చీనీ పంట దిగుబడి వచ్చేది అనంతపురం జిల్లాలోనే అన్నారు. ఇక్కడ పంట కొనుగోలు ఒక రహస్యంగా సాగుతోందన్నారు. ఉన్న కొద్ది మంది వ్యాపారులు నిర్ణయించినదే ధర అవుతోందన్నారు. ఈనామ్ పద్ధతిలో అయితే బయట నుంచి వ్యాపారులెవరూ ఎందుకు కొనడం లేదన్నది పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే కమీషన్ అధికంగా రైతుల నుంచే వసూలు చేస్తున్నారని చెప్పారు. మార్కెట్‌యార్డులో ఇప్పుడున్న సౌకర్యాలు సరిపోవని, మరిన్ని షెడ్ల నిర్మాణంతోపాటు, కోల్డ్ స్టోరీజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి మార్కెట్‌యార్డు ఛైర్మన్ స్పందిస్తూ ఈనామ్ విధానం ఇక్కడ మాత్రమే తీసుకొచ్చింది కాదని, 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇప్పుడు రైతులు ఇచ్చిన అభ్యర్థన మేరకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని హామీనిచ్చారు. అదనపు షెడ్ల నిర్మాణం చేపట్టే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి , పండ్లతోటల సంఘం నాయకులు అనంత రాముడు, ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, నారపరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, చెన్నారెడ్డి, ఆనంద్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పండ్ల తోటల , రైతుసంఘం నాయకులు

- పది లక్షల టన్నులకు 12 మంది కొనుగోలుదారులు
- ముఖ్యమంత్రి సొంత జిల్లా మార్కెట్‌యార్డులో వేలం
- 'అనంత'లో ఈనాం పద్ధతిలో చీని పంట కొనుగోలు
- వద్దే వద్దంటున్న రైతులు

ఈనాంకు సున్నం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతులకు మేలు చేస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల కొనుగోలుకు తీసుకొచ్చిన ఈనాం పద్ధతికి వ్యాపారులు, అధికారులు కలసి సున్నం పెట్టారు. ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచి అయినా పంట కొనడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈ పద్ధతిని 2016లో కేంద్రంలోని బిజెపి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానం వ్యాపారుల పాలిట వరంగా మారిందని చెప్పవచ్చు. గతంలో వేలంలో ఒకరిద్దరు వ్యాపారులైనా పోటీ పడేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఈనామ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు, బయటి వ్యక్తులెవరూ కొనుగోలుకు రాకుండా ఇక్కడున్న వ్యాపారులే మేనేజ్ చేస్తూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. స్థానిక వ్యాపారులు నిర్ణయించేందే ధర అవుతోంది.

పది లక్షల టన్నులకు 12 మంది వ్యాపారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42,490 హెక్టార్లలో చీనీపంట ఉంది. ఏడాదికి రాష్ట్రంలోనే అత్యధికంగా దిగుబడి అనంతపురం జిల్లాలోనే వస్తుంది. ఇక్కడ ఏడాదికి సగటున పది లక్షల టన్నుల దిగుబడి చీని పంట వస్తుంది. ఇంత పెద్దఎత్తున పంట వచ్చే ఈ జిల్లాలో ఉన్న చీనీ మార్కెట్ అనంతపురం వ్యవసాయ మార్కెట్ ఒక్కటే. ఇక్కడ చూస్తే కేవలం 12 మంది వ్యాపారులు మాత్రమే మార్కెట్ శాఖ వద్ద రిజిస్టర్ అయ్యి ఉన్నారు. వీరు నిర్ణయించినదే ధరగా అమలు జరుగుతోంది. ఉత్తరాది వ్యాపారులు వచ్చినా నేరుగా కొనుగోలు చేయడానికి వీల్లేని పరిస్థితులున్నాయి. ఈ వ్యాపారుల వద్ద నుంచే కొనుగోలు చేసుకుని వెళ్తుండటం ఆనవాయితీగా మారింది. ఉన్న అతికొద్ది మంది వ్యాపారులు సిండికేట్ అవడంతో వారు నిర్ణయించినదే ధరగా మారుతోంది. కొత్త వ్యాపారులను రప్పించి కొనుగోళ్లు పెంచే విధంగా చూడాల్సిన మార్కెటింగ్ శాఖ మౌనంగా ఉంటూ అది తమ బాధ్యత కాదన్నట్టుగా ఉండటం గమనార్హం.

పనిచేయని సైన్ బోర్డు

ఈనాం పద్ధతిలో వ్యాపారం మొదలయ్యాక దేశంలో ఏ మార్కెట్‌లో చీనీ ధర ఎంతకు పోతోందన్నది ఎప్పటికప్పుడు సైన్‌బోర్డులో డిస్‌ప్లే అవుతూ ఉండాలి. కానీ అనంత మార్కెట్‌లో అలా జరగడం లేదు. గత సీజన్ నుంచి అది పనిచేయకుండా ఉంది. అధికారులు ఈ విషయాన్ని కూడా గుర్తించకపోవడం గమనార్హం. ఈ అంశంపై కార్యదర్శి జయలక్ష్మిని వివరణ కోరగా పనిచేస్తోందని చెప్పారు. పని చేయడం లేదని చెప్పగా ఆమె కింది స్థాయి ఉద్యోగినిని అడిగారు. కింది స్థాయి ఉద్యోగి పనిచేయడం లేదని చెప్పగా తన దృష్టికి తీసుకురావాలి కదా అని సదరు ఉద్యోగికి చెప్పడం గమనార్హం.

నాలుగు శాతం కమీషన్ అయితే పది శాతం వసూళ్లు..!

వ్యవసాయ మార్కెట్‌లో నాలుగు శాతం మాత్రమే కమీషన్ తీసుకోవాలని నిబంధనలున్నాయి. ఈ నిబంధనలను అధికారుల కళ్లేదుటే యధేచ్ఛగా వ్యాపారులు ఉల్లంఘించి పది శాతం వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం నాడు రైతులు మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ ఇప్పటి వరకు ఫిర్యాదు ఇవ్వలేదు కాబట్టి చర్యలు తీసుకోలేదని. ఎవరైనా ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలపడం కొసమెరుపు. ఓవైపు రైతులు తమకు నష్టం జరుగుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నా మార్కెట్‌యార్డు అధికారులు పట్టించుకోకుండా నిబంధనల సాకు చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక్కడేమో ఈనాం..పులివెందులలో వేలం..!

అనంతపురం మార్కెట్‌లో ఈనాం పద్ధతి కాకుండా వేలం ద్వారా చీనీ పంట కొనుగోళ్లు చేపట్టాలని రైతులు అడుగుతుంటే... అది ప్రభుత్వ నిర్ణయమని మార్కెటింగ్ శాఖ అధ్యక్షులు ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మి చెబుతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందుల్లో వేలం పద్ధతిలోనే కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇదే విధానాన్ని ఇక్కడా అమలు జరపని రైతులు అడుగుతుంటే మాత్రం నిబంధనలు అంటూ అధికారులు సమాధానం ఇస్తున్నారు. వేలంలో అయితే రైతుకు పంట ఏ ధరకు అమ్ముడుపోతోందన్న విషయం అయినా తెలిసే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఈనాం పద్ధతిలో ఎంతకు అమ్ముడుపోయిందన్న వివరాలు కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మేస్త్రీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్య చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణం నుంచి కంపోస్టు యార్డుకు ట్రాక్టర్లు, కంప్యాక్టర్ల నుంచి రోజుకు ఒకటి, రెండు ట్రిప్పులు మాత్రమే చెత్తను తరలిస్తున్న విషయం తెలుసుకున్న కమిషనర్ శుక్రవారం తన చాంబర్‌లో మేస్త్రీలతో పాటు శానిటరి ఇన్స్‌పెక్టర్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను తరలించడానికి ఉన్నా ట్రాక్టర్లు, కంప్యాక్టర్లతో రోజుకు కనీసం మూడు ట్రిప్పులు కంపోస్టు యార్డుకు చెత్తను తరలించక పోతే పర్వేక్షణ చేసే మేస్త్రీలతో పాటు శానిటరి ఇన్స్‌పెక్టర్ పై సైతం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక ట్రిప్పు చెత్త తరలించడానికి ఎంత సమయం పడుతుందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు 8గంటలు పని చేయాల్సి ఉంటే ఎంత సేపు పని చేయిస్తున్నారని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి, ఒక చోట చేర్చిన చెత్తను సైతం పూర్తి స్థాయిలో కంపోస్టు యార్డుకు తరలించక పోతే ట్రాక్టర్లు, కంప్యాక్టర్లు, వాటికి అవసరమైన సిబ్బంది ఎందుకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై కనీసం రోజుకు మూడు ట్రిప్పులు చెత్తను తరలించక పోతే ఆ రోజు వేతనంలో కోత విధించాల్సి ఉంటుందన్నారు.

సబ్ జైలులో అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

ఖైదీలు ప్రవర్తన మార్చుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు వచ్చిన ఖైదీలు తిరిగి వెళ్ళేటప్పుడు తమ ప్రవర్తనను మార్చుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ జైలును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ప్రస్తుతం ఉన్న ఖైదీలు, వారికి అందుతున్న సదుపాయాలపై జైలు అధికారి అంజి నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సబ్ జైలు గదులను పరిశీలించి అక్కడ ఉన్న సదుపాయాలపై పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, నరసింహమూర్తి, శివకుమార్, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి కాళేశ్వర్ వర్థంతి

ప్రజాశక్తి- పెనుకొండ

డాక్టర్ సాయి కాళేశ్వర్ 12వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివసాయి మందిరం వద్ద గల కాళేశ్వర్ సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా ప్రతి రోజూ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. 150మందికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని మరో 40 మంది కి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని అన్నారు. వారం కిందట నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో 300మందికి వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, కంటి వైద్యులు, నవశ్రీ కంటి ఆసుపత్రి సిబ్బంది, ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, బాబు తదితరులు పాల్గొన్నారు.


కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

మహిళలతో మాట్లాడుతున్న శిల్ప కాళేశ్వర్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా పట్టించుకోరా..?

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ప్రశ్నించారు. శుక్రవారం నాడు ప్రశాంతి గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పుట్టపర్తి, కొత్తచెరువు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అక్రమణకు గురవుతున్నా రెవెన్యూ, అహుడా, మున్సిపాలిటీ, అగ్నిమాపక శాఖలు స్పందించడం లేదన్నారు. కబ్జాదారులు ఎకరాల కొద్ది భూమిని స్వాధీనం చేసుకుంటున్నారని తెలిపారు. కొత్తచెరువు ప్రభుత్వం పొలం సర్వేనెంబర్ 483-1లో 164 ఎకరాలు ఉందన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని యనుమలపల్లిలో సర్వేనెంబర్ 454-2, 454-3, 454-6లో కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమి 3.60 ఎకరాల ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు అక్రమంగా పెద్దపెద్ద భవంతులు నిర్మించారన్నారు. ఈ స్థలాన్ని ఓ ప్రయివేటు వ్యక్తి కబ్జా చేసి ఐదు అంతస్తుల భవనాలు, స్విమింగ్ పూల్‌ను నిర్మించాడని చెప్పారు. ఆక్రమించిన ఈ స్థలం పక్క నుంచే ప్రతిరోజూ జిల్లా, మండల అధికారులందరూ వెళ్తున్నా వారెందుకు దీని గురించి పట్టించుకోవడం లేదని నిలదీశారు. ప్రజాసంఘాల ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై గతంలో కూడా అధికారులకు తెలిజేశాయన్నారు. అధికారుల స్పందించకపోవడంతో ఆక్రమణదారులు కొత్త భవనాలను నిర్మిస్తున్నారని తెలియజేశారు. అహుడా అక్రమ నిర్మాణాలను గుర్తించినా వాటిని స్వాధీనం చేసుకోలేదన్నారు. కప్పలబండ పొలం సర్వేనెంబర్ 127-3A, 127-3B, 127-2, 195-3, 195-4, 195-5లో 14.61 ఎకరాలు మామిళ్లకుంట క్రాస్ రైల్వే స్టేషన్ పక్కన ఉందన్నారు. ఈ భూమిని స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. దీనిని కూడా రియల్ ఎస్టేట్‌దారులు కబ్జా చేశారన్నారు. బహిరంగంగానే ఆక్రమణ జరుగుతున్నా అధికారులు కళ్లు మూసుకుని చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కప్పలబండ సర్వేనెంబర్ 308లో 13.32 ఎకరాలల్లో అగ్రిమెంట్ పేరుతో కొందరు కాజేయాలని చూస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులను ప్రభుత్వ సంక్షేమ భవనాల కోసం స్థలం అడిగితే ఎక్కడా స్థలం లేదని చెబుతున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం వెనుక పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, లైబ్రరీ కోసం స్థలం కేటాయించాలని సంవత్సరం తరబడి విజ్ఞప్తి చేస్తున్నా స్థలం లేదని చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వాటి పరిరక్షణకు సిపిఎం ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం అయ్యి పేదల కోసం భూస్వాధీన ఉద్యమం నిర్వహిస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, సిపిఎం నాయకులు బ్యాల్ల అంజి, రామకష్ణ, సిద్దు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

డిఎస్‌ఒ వంశీకృష్ణారెడ్డి

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వినియోగదారుల హక్కుల పరి రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులను పరిరక్షించుకోగలిగిన అంశాలపై అవగాహన కల్పించారు. వినియోగం లేకుంటే ఉత్పత్తి ఉండదని ఉత్పత్తి లేకుంటే ఆర్థిక ప్రగతి సాధించలేమని అన్నారు. అందుకే వినియోగదారుడే ఆర్థిక ప్రగతికి సూత్రధారి అవుతున్నాడన్నారు. నాసిరకం ఉత్పత్తులతో అనుచిత వ్యాపార విధానాలతో మోసాలతో వినియోగదారుడు నష్టపోతే మార్కెట్లపై విశ్వాసం కోల్పోతే ఆర్థిక ప్రగతి పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వినియోగదారులు తమ హక్కులను ఏమిటో తెలుసుకుంటే న్యాయం జరుగుతుందన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించడంతో పాటు పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులను అధికారులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్లు విజయనిర్మల, రమేష్, వాణి, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా, జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి శివశంకర్, మాస్టర్ ట్రైనర్లు లక్ష్మీనారాయణ, రవిచంద్ర రెడ్డి, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శోభ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'వైసిపితోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి మడకశిర

వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ నాయకులు అన్నారు. రొళ్ల, అగళి మండల కేంద్రంలో కన్వీనర్లు నరసింహ రెడ్డి, స్టూడియో శ్రీనివాస్ అధ్యక్షతన మేము సిద్ధం మా బూత్ సిద్ధం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ఈరలక్కప్పతో పాటు వక్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ గెలుపునకు కృషి చేయాలన్నారు. తాను ఎమ్మెల్యే అయినవెంటనే వాలంటీర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసి తనకు వచ్చే వేతనంలో సగభాగం వాలంటీర్ల సంక్షేమ నిధికి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ప్రసాద్ రెడ్డి, రొళ్ల జెడ్పిటిసి అనంతరాజు, ఎంపీపీ కవిత, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, హలుకూరు కాంతరాజు, నాగేంద్ర,అగళి మహేంద్ర, రొళ్ల నాగేంద్ర, అగళి స్టూడియో శ్రీనివాస్, జీబి శివకుమార్,రవిశకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతులను లాభాలబాటలో నడిపించాలి : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్టం చేసి రైతులను లాభాల బాటలో నడిపించి ఆర్థికంగా బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సభ్యులు రవిచంద్ర రెడ్డి, కేశవరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవి సుబ్బారావు సంబందిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాలవెలువ కార్యక్రమాన్ని విస్తృత పరచడంలో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. మామిడి తోటల సంరక్షణపై గ్రామస్థాయిలో అవగాహన చేపట్టాలన్నారు. అలాగే వేసవిలో రైతులకు ఎలాంటి విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అగ్రి బోర్డు సలహా మండలి జిల్లా అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి రైతులను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ లో విత్తన పంపిణీకి సంబంధించి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఎల్డీఎం రమణ కుమార్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ సురేఖ, మార్కెటింగ్ ఏడీ నరసింహా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మహిళల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆజి షకీరా, పిసిసి జనరల్ సెక్రెటరీ వీరనారాయణ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం కొత్త చెరువులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు పార్టీ అధికారంలోకి వస్తే మహిళల కోసం ఐదు పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం నజీర్, నాయకులు మోహన్, సనావుల్లా, ఇమ్రాన్‌బాషా, షామీర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు తొలగింపు

సోమందేపల్లి : మండల కేంద్రంలోని నల్లగొండరాయని పల్లి సమీపంలోని జాతీయ రహదారి పక్కనగల ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు శుక్రవారం తొలగించారు. డిటి శంకర్ ఆధ్వర్యంలో విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, పంచాయతీ కార్మికులతో కలిసి గుడిసెలను తొలగించారు. ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే ప్రభుత్వ అధికారులే దగ్గరుండి తొలగించడం బాధాకరమని సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి విమర్శించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులచే వడదెబ్బ , సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వడదెబ్బపై అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమములో సామాజిక ఆరోగ్య కార్యకర్త నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణ, సచివాలయ అడ్మిన్ రవీంద్ర నాయక్, ఆరోగ్య కార్యకర్త అనురాధ , ఆశా కార్యకర్త గులాబ్ జాన్, లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల

బత్తలపల్లి : ఇల్లు_ లేని పేదవారికి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపిపి బగ్గిరి త్రివేణి అన్నారు. శుక్రవారం మండలంలోని అప్రాచెరువు గ్రామ సచివాలయంలో వంద రోజుల పథకంలో భాగంగా మంజూరైన 50 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా అప్రాచెరువు వాసులకు ఇన్ని పట్టాల పంపిణీ ఎప్పుడూ జరగలేదన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, అంకె వీరనారప్ప, మునులప్ప, విఆర్‌ఒ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామ సచివాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మాజీ మండల కన్వీనర్ ముష్టూరు నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందుతోందన్నారు. వైద్యాధికారి గంగిరెడ్డి ఆధ్వర్యంలో వైద్యచికిత్సలు, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిశోర్, ధరణికుమార్, జయరాయులు, హెల్త్ రవీంద్ర, మారుతి, ఎంఎల్‌హెచ్‌పి హేమలత, సునీత, శ్రావణి, ఏఎన్ఎం మంజుల, ప్రభావతి మాలతి, రాధామహేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పాలనకు చరమగీతం : బికె

పెనుకొండ: వచ్చే ఎన్నికల్లో జగన్‌పాలనకు ప్రజలు చరమగీతం పాడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి జోస్యం చెప్పారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్థసారథి మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్‌లో పతనం మొదలైందన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు పట్టం కట్టనున్నట్లు జాతీయ మీడియా సంస్థలు అంచనా వేశాయన్నారు. జగన్ రెడ్డి గద్దె దిగే రోజు దగ్గరలోనే ఉందని, ప్రజలు కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని స్పష్టం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి టీడీపీ మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, పెనుకొండ పట్టణ బిసి సెల్ అధ్యక్షులు శంకర్, గోనిపేట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

హిందూపురం : పట్టణంలో ప్రధాన కూడళ్లలో 50 రోజుల పాటు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసిపి యువ నాయకులు మనోజ్ జాలియట్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్, పరిగి నగర్, చిన్న మార్కెట్ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, సంజీవ, పండు, బాలరాజు, హనూక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలం మహమ్మదాబాద్ గ్రామమునకు చెందిన మా కక్షిదారులైన పి.హనుమంతు, పి.నారాయణప్ప, పి.లక్ష్మన్న, పి.చలపతి, రమణప్ప మరియు పి.రామలక్ష్మమ్మ మీద వాది అయిన పిచ్చిలి వెంకట్రమణప్ప మా కక్షిదారులపైన అనంతపురం సివిల్ జూనియర్ కోర్టు నందు O.S No:490/2021 దావా వేయబడి వ్యవహారములు జరుగుచున్నవి. వాది అయిన పిచ్చిలి వెంకట్రమణప్ప అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులను [illegible] ప్రయత్నిస్తున్నారు. [illegible] తెలియజేయడమైనది.

షెడ్యూలు

హిందూపురం రి.డి.ఓ కదిరి సబ్.రి.డి.ఓ అమడగూరు మండలం మహ్మదాబాద్ గ్రామ పొలంలోని ఆస్తుల వివరము.

1.Govt Dry Sy.No:147-3 A.C. 2-82 పైకి 1/12 th Share i.e A.C.0.23 1/2 సెంట్లు ఇందుకు సరిహద్దులు. [illegible]

2.Govt Dry Sy.No:147-3 A.C. 2-82 పైకి A.C.0.47 సెంట్లు ఇందుకు సరిహద్దులు. [illegible]

3.Govt Dry Sy.No:146-B A.C. 2-74 సెంట్లు పూరా

కె.నరేంద్ర, B.B.A., L.L.B,
ఎ.పి.సిద్ధార్థ సాయికుమార్ రెడ్డి, B.A., B.L,
వాదులతరుపు వకీళ్లు, కదిరి.

ఎన్నికల విజయవంతానికి అందరి సహకారం అవసరం

ఇవిఎంను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాబోవు సాధారణ ఎన్నికల విజయవంతానికి అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని, ఇందుకుగాను ఎన్నికల్లో ఉపయోగించే బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ తదితర వాటిపై రాజకీయ నాయకులు కూడా పూర్తిగా అవగాహన ఉండాలని ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి తెలిపారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సాధారణ ఎన్నికలు 2024 ఎన్నికల నిర్వహణ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధివిధానాలపై పాటించాల్సిన పద్ధతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వ అధికారులతో పాటించాల్సిన ఎన్నికల నియమ నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, స్థానిక తహశీల్దార్ రమేష్, డిఎఒ రమేష్ బాబు, నియోజకవర్గ ఎన్నికల ఉప తహశీల్దార్ షణ్ముఖ యాదవ్, వైసిపి, టిడిపి, బిజెపి, కాంగ్రెస్, సిపిఎం తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

ప్రజాశక్తి - కొత్తచెరువు

వేసవికాలం ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య అధికమైనదని ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు సర్పంచులు, ఎంపిటీసీ అధికారులను కోరారు. స్థానికఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. నాగిరెడ్డిపల్లి, లింగారెడ్డిపల్లి, వంగంపల్లి, గ్రామాలలో బోర్లు ఎండిపోవడంతో గ్రామాల్లో తీవ్ర నీటి సమస్య నెలకొన్నదని ఎంపీటీసీ సాంబశివారెడ్డి, సర్పంచి హరిత సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే అక్కడ బోర్లు వేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారి నటరాజు, మాట్లాడుతూ ఖరీఫ్ లో పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు రూ. 3.95 కోట్లు మంజూరు అయిందని త్వరలో వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఉపాధి హామీ ఏపీవో నాగిరెడ్డి మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు ఉపాధి పనులను కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు గంగరాజు, సరళ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం టికెట్ కేటాయించాలని కోరుతూ పట్టణం లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఎకెకోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన విద్యార్థులు పోతన్ కుమార్, అభిషేక్ జనవరిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు శిక్షణా కేంద్రం డైరెక్టర్ ఆంధ్రరత్నం అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఫలితాలపై శుక్రవారం ఆయన మాట్లాడుతు కోచింగ్ సెంటర్ ప్రారంభించిన మొదటి సంవత్సరం ఇద్దరు విద్యార్థులు సైనిక్ ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. ఇద్దరు విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి అర్హత సాధించారన్నారు. కోచింగ్ సెంటర్ లో జవహర్ నవోదయ, సైనిక్ స్కూల్, గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. దీంతో పాటు అన్ని రకాల పోటీ పరీక్షలకు అనుభవజ్ఞులైన శిక్షకులతో సాధారణ ఫీజులతో ఉత్తీర్ణత సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సైనిక్, నవోదయ, గురుకుల పరీక్షలకు శిక్షణ కోసం 9441507754 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుడిబండ : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో గుడిబండ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ పాఠశాలలో ఈనెల జనవరి 28వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు పరీక్షలు రాయగా వారందరూ ఉత్తీర్ణత సాధించినట్లు సైనిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

మహిళా పక్షపాతి వైసిపి : మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమనిరాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణంలో వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత నగదు జమ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించారని అన్నారు. అనంతరం వైయస్సార్ చేయూత మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఉద్యోగాల్లో భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐ టీడీపీ, టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఉద్యోగాల్లో జరిగిన అవినీతికి సీఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ వైసిపి నేతలు ఉద్యోగాలను అంగట్లో సరుకులా అమ్ముకుని రూ.150 కోట్ల కుంభకోణంకు పాల్పడి నిరుద్యోగ యువతకు అన్యాయం చేశారని విమర్శించారు. నిరుద్యోగ యువత వచ్చే ఎన్నికల్లో జగన్‌ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్ కుమార్, సతీష్ కుమార్, నాయకులు దుర్గా నవీన్, నజీర్ ఆహ్మద్, అంజి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - పరిగి

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సవితమ్మ

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అన్నారు. మండల కేంద్రంలోని బీరలింగేశ్వరస్వామి కళ్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో సవితమ్మ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పెనుగొండ నియోజకవర్గంలో తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, మాజీ వైస్ ఎంపీపీ చౌడప్ప, డిఎస్-ఎల్ శ్రీనివాసులు, గోవిందరెడ్డి, వడ్డెర శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో ఆరాచక పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని టీడీపీ, జనసేన ఉమ్మడి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ జోస్యం చెప్పారు. శుక్రవారం మండలంలోని నాగలూరు పంచాయతీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగలూరు నారాయణ స్వామి ఆధ్వర్యంలో నాగులూరు ,బండ్లపల్లి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ లోకి అధికారం లోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు సవితమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ,మహిళలు ,పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కదిరి టౌన్ : కదిరి పట్టణం 24వ వార్డులో మూడు బాధిత కుటుంబాలకు వైసిపి సమన్వయకర్త మక్బూల్ ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఒక్కో కుటుంబానికి రూ.10వేల ప్రకారం రూ.30వేలను ఆ వార్డు యువ నాయకులు సమీర్ ఖాన్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమం లో కటిక సంఘ యువ నాయకులు ఇబ్రహీం, సనావుల్లా, జుబైర్, బాబాజాన్, తాజుద్దీన్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, తదితరులు

పట్టణంలోని పురాతన పాండురంగ ఆలయాన్ని పునర్నించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాండురంగ స్వామి ఆలయంలో రూ. 1.25కోట్ల వ్యయంతో చేపట్టనున్న జీర్ణోద్ధరణ పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పురాతన పాండురంగ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో విషయాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన ఆలయ అభివృద్ధి కోసం రూ.1.25కోట్ల నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేశారన్నారు. ఆగర్భగుడి, గోపురం, శిథిలావస్థకు చేరిన ప్రాంగణం. నూతన ధ్వజస్తంభం, ఉపాలయాలు, కళ్యాణమండపాన్ని ఈ నిధులతో నిర్మించడం జరుగుతోందన్నారు. పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ తబ్జూలు శ్రీనివాసులు, ఆలయ ఈవో వెంకటేశ్వర్లు, చింతా క్రిష్ణయ్య, నాగిరెడ్డి, చితంబరేశ్వరబాయ్, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, జేసీబీ రమణ, గజ్జల శివ, కడప రంగస్వామి, చింతా యల్లయ్య, బూశెట్టి రామకృష్ణ, బడన్నపల్లి కేశవరెడ్డి, కాచర్ల అంజి, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తూమకుంటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంటలో కుశల్ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వాసవ్య మహిళా మండలి విప్రో కేర్ సహకారంతో కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సంయుక్తంగా ఉచిత రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది దాతలు రక్త దానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమి మాట్లాడుతు రక్త దానం చేస్తే గుండె సమస్యలు తగ్గుతాయని, నాడీ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని అన్నారు. రక్త దానం చేసిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ, కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది మల్లేశ్వరి, కృష్ణవేణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పల్లె సింధూరకు ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారంలో పల్లె కుటుంబసభ్యులు, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపి అభ్యర్థిగా పల్లె సింధూర రెడ్డిని అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో మొదటిసారిగా నియోజకవర్గంలోకి ప్రవేశించిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం కొత్తచెరువు, బుక్కపట్నం, జానకంపల్లి మీదుగా పుట్టపర్తిలోకి ఆమె ప్రచార రథం చేరుకుంది. ఆమె వెంట వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఉన్నారు. పుట్టపర్తిలో బాణాసంచా కాలుస్తూ గజమాలతో సింధూర రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 193 చెరువులు నింపడడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. 27 ఏళ్లుగా పల్లె రఘునాథ్ రెడ్డి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని సేవలు అందిస్తామన్నారు

కొత్తచెరువు రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామాల్లో మహిళలు యువకులు ఆమెకు నీరాజనం పలికారు. కొత్త చెరువు మండల సరిహద్దు కొడవగానిపల్లి సమీపంలోని సత్యసాయి వాటర్ ట్యాంక్ వద్ద భారీ కాన్వాయ్ తో వచ్చిన పల్లె సింధూర రెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు. మండలంలోని కొడవగానిపల్లి సరిహద్దు నుంచి కొడవగానిపల్లి ,మైలే పల్లి, కొత్త చెరువు వరకు భారీ ర్యాలీ సాగింది. కొత్త చెరువు సర్కిల్ లో అంబేద్కర్ విగ్రహానికి వాల్మీకి విగ్రహానికి ,ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు .అక్కడినుండి బుక్క పట్నం, జానకంపల్లి , కర్ణాటక నాగేపల్లి మీదుగా చిత్రావతి పుట్టపర్తి గణేష్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబంపై ఎంతో నమ్మకం ఉంచి తన కోడలు పల్లె సింధూరకు టికెట్ ఇచ్చినందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపికి వస్తున్న ఆదరణ చూసి జగన్ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

బుక్కపట్నం : పుట్టపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి మండలంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఆమెకు మండల సరిహద్దు చెరువు కట్టపై టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. జానకంపల్లి మీదుగా పుట్టపర్తి తరలి వెళ్లారు. ర్యాలీలో పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, జనసేన సమన్వకర్త చంద్రశేఖర్, భారీ సంఖ్యలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ధర్మవరం టౌన్ : మండలంలోని కుణుతూరు వద్ద ఓ యువకుడు తన ద్విచక్రవాహనంలో వెళుతూ చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన చందు(26) మరూరు టోల్ ప్లాజాలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంలో శుక్రవారం ధర్మవరం వచ్చాడు. పనిముగించుకుని తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళుతుండగా కుణుతూరు జగనన్న లేఅవుట్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టును వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చందు తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు

పుట్టపర్తి రూరల్ : కర్నాటక, ఆంధ్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో పోలీసులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కర్నాటక ఆంధ్ర సరిహద్దులో ఉన్న కోడికొండ చెక్ పోస్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై పోలీసులు తనిఖీలు చేపట్టి వాహనదారులకు అవగాహన కల్పించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు.

పోలీసు కవాతు

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ,సోమగట్ట పంచాయతీలలో 131 వ బెటాలియన్ కి చెందిన 70 మంది బీఎస్ఎఫ్ సాయుధబలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ మేరకు హిందూపురం డీఎస్పీ కంజంక్షన్ మాట్లాడుతూ రాష్ట్రం లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నేపద్యంలో సమస్యాత్మక ప్రాంతాలలో కవాతు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం రూరల్ సిఐ ఈరన్న,చిలమత్తూరు ఎస్ఐ గంగాధర్, లేపాక్షి ఎస్ఐ గోపీ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

లేపాక్షి : మండలం పరిధిలోని ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యకాసం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు మండలంలోని కంచి సముద్రం సచివాలయంలో గ్రామ రెవిన్యూ అధికారి గంగరత్నమ్మ కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా కూలీలు, నాయకులు మాట్లాడుతూ ఉపాధి పనుల చోట కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కూలీలు ప్రేమావతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

లేపాక్షి :మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. మండల కేంద్రం లోని స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 3084 మంది మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం చేయూత పథకం ద్వారా మంజూరు చేసిన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సీసీలు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతిమయం : టిడిపి

మడకశిర : రాష్ట్రంలో వైసిపి పాలన మొత్తం అవినీతి మయమేనని మడకశిర అసెంబ్లీ టిడిపి అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ విమర్శించారు. ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణానికి వ్యతిరేకంగా శుక్రవారం మడకశిరలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీలో ఇంత పెద్ద కుంభకోణానికి పాల్పడం దారుణమన్నారు. తెలంగాణలో ప్రజలు ఏ విధంగా కేసీఆర్ కు బుద్ధి చెప్పారో అలాగే ఆంధ్రప్రదేశ్లో కూడా జగన్‌కు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, శివాజీతో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలను నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే

బత్తలపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఈదుల ముష్టూరు,బీసీ కాలనీల్లో ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను ఆదరించాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పొత్తులు పెట్టుకుని వస్తున్నారని వారి ఎత్తులను చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్. రాంభూపాల్ రెడ్డి, మాజీ కన్వీనర్లు బగ్గిరి బయపరెడ్డి, ముష్టూరు నరసింహారెడ్డి, సర్పంచి గోపాల్ పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేద్దాం

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని వచ్చే ఎన్నికల్లో అంతమొందిద్దామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోద వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కదిరి పట్టణంలోని కూటగుల్లా 36వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఆమె ఇంటింటికి తిరుగుతూ టిడిపి రూపొందించిన మినీ మేనిఫెస్టోలోని అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ గంగభవాని, శంకర్, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

చెక్కును అందజేస్తున్న మక్బూల్

కదిరి టౌన్ : బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సిఎం సహాయనిధి చెక్కులను వైసీపీ సమన్వకర్త మాక్బుల్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకంతో ఉచిత వైద్య సేవలు పొందలేని ఆరు మండలాలకు చెందిన 23 మంది బాధితులకు మంజూరైన రూ. 22.98 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు జిలాన్ భాష, మున్సిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన బత్తల

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టరు బత్తల హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణ శుక్రారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై సజ్జల వారితో చర్చించినట్లు సమాచారం.

టీడీపీలో పలువురు చేరిక

కదిరి టౌన్ : పట్టణంలోని టీడీపీ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు టిడిపిలో చేరారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సల్మాన్ ఖాన్, ఆధ్వర్యంలో కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోదమ్మ సమక్షంలో తెలుగు నాడు విద్యార్థి సమైక్య విభాగంలో పలువురు యువతి ,యువకులు, పార్టీలో చేరారు. నాగమణి, హజీరా, సాయిలీల, విజయ్, మధు, సంతోష్, రేవంత్, ఉదయ్, చరణ్ తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అహ్మద్ అలీ, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మైనార్టీ నాయకులు అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో కందికుంట

ఇష్టపడి చదవండి

హిందూపురం : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య ఛేదన కోసం క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం వారి వెంటే ఉంటుందని ఎల్ ఆర్‌జి విద్యాలయ హెడ్ మాస్టర్ ప్రసాద్ సూచించారు. మార్చి 18 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి విద్యాలయలో పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి పూజ, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతు పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఏ కళాశాలకు వెళ్లిన గతంలో చదువుకున్న పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల గౌరవాన్ని పెంపొందించే విధంగా ఆయా కళాశాలల్లో మెలగాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎఒ సంజీవ రెడ్డి, ఎహెచ్ఎం సుధ, ఉపాధ్యాయులు మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.